

# సరళాదేవి పొదుపు

ఎస్. పురుషోత్తమాచార్య

ఈ మధ్య నా కథలు అడపా దడపా వివిధ పత్రికల్లో పడుతూనే ఉన్నాయి. పాఠకులు పత్రికాముఖంగా తెలుపుతూ వున్న అభిప్రాయాలవల్ల వారు నా కథల్ని బాగానే ఆదరిస్తున్నారని తెలుస్తోంది దాంతో నాక్కూడా పేరొస్తోంది. కదా అన్న భావం నాలో జీర్ణించుకుపోసాగింది. ఈ సమయంలో నాకో ఆలోచన వచ్చింది. నా కెలాగూ పేరొస్తుందన్నది' నిర్వివాదాంశం. అయితే నేనొక్కణ్ణే పేరు తెచ్చుకుని ఓ వెలుగు వెలిగిపోవడం నా కెంత మాత్రమూ ఇష్టంలేదు. నా జీవితంలో నా శరీరంలో, నా కష్టసుఖాల్లో అన్నిట్లోనూ భాగం పంచుకుంటూన్న అమాయకురాలైన నా భార్య నలా గాలికొదిలేసి నేనలా కీర్తికవాటాల వైపు పరుగులు తీయటానికి నా మనసంగీకరించటంలేదు. అంచేత మా ఆవిడచేత కూడా ఒకటీ అరా కథల్రాయించి

ఆవిడ పేరుని కూడా వెలుగులోనికి తీసుకరావడానికి నడుం కట్టుకున్నాను. మొదట్లో ఆవిడ పేరు పెట్టి నేనే ఎందుకు వ్రాయకూడదని తోచింది. కాని అలాంటి పెడత్రోవలు త్రొక్కటానికి నా హృదయం అంగీకరించటంలేదు.


ఆ క్షణం నుంచీ రచయిత్రికి కావలసిన గుణగణాల్ని మా ఆవిడలో అన్వేషించసాగేను.

మా ఆవిడ పిట్టగోడ దగ్గర నుంచుని "ఇహ వెళ్ళొస్తాను సరళగారూ!" అంటూనే గంటలకొద్దీ కాలు కదపని ప్రక్కింటి పద్మనాభంగారి సతీమణికి "పనులైపోయాయాండీ ?" అంటూ పంచనచేరే ఎదురింటి ఏకాంబరంగారింటావిడకూ, యిరుగమ్మ, పొరుగమ్మల కథల్ని అతి సహజంగా, అతి నేర్పుగా వున్నవీ లేనివీ కల్పిస్తూ చెబుతూండటం నేను చాలా సార్లు విన్నాను దాంతో మా ఆవిడలో కూడా రచయిత్రికి కావలసిన కల్పనాశక్తి నా కళ్ళకి ద్యోతకమవుతూ వచ్చింది.

మర్నాడు ఏదో వారపత్రికలో నా కథనిచదివినన్నభినందించటానికి వచ్చిన నా మిత్రులు కొందరు యధాలాపంగానే "మీ ఆవిడచేత కూడా కథల్రాయించరాదు బోయ్! ఎంచక్కా మీ దంపతుల కథల్ని చదువుతూ మురిసిపోతాం!" అంటూ కూచున్నారు. దాంతో నా ఊహకి ప్రోద్బలం లభించినట్లయింది యిక మా ఆవిణ్ణి రచయిత్రిగా తీర్చి దిద్దటమే నా ప్రథమ కర్తవ్యంగా తోచింది.

అయితే యిక్కడో చిక్కొచ్చి పడింది. మా ఆవిడెపుడో చిన్నతనంలో వెలిగించిన చదువు ఏదోక్లాసు! అది కేవలం మా ఆవిడకి చాకలిపద్దులు వ్రాయటానికీ, అంగట్లోంచి తేవలసిన సరుకుల్నేకరువు పెట్టటానికి మాత్రమే పనికివస్తోంది. నేను ఆశ్చర్యపడవల్సి వచ్చిన రోజున మాత్రం ఏ పత్రికో ముందుంచుకుని అందులోని వాక్యాల్ని గుణకారాలూ, భాగహారాలుగా విభజిస్తూ గొణుక్కుంటూ కన్పిస్తుంది. ఆ వాక్యాల్లోని సారాంశం ఏమాత్రం ఆవిడకు బోధపడిందన్నదే నా కంతుపట్టని విషయం. అలాంటి పరిస్థితుల్లో ఆవిడ చేత నేను కథనెలా వ్రాయించగలనన్న అధైర్యం నాలో ఆరంభంలో అంకురించింది. కాని స్థిరచిత్తుడనయిన నే నా భావాన్ని త్వరలో నేతొలగించుకునిమానవ ప్రయత్నానికి మాత్రమే పాటు బడటానికి నిశ్చయించుకున్నాను. ఆ రోజు నుంచే మా ఆవిడచేత పత్రికల్ని చదివించటానికి నాంది పలికాను. ఇహ అప్పట్నుంచే నాకు కష్టాలు ఆరంభమయ్యాయి.

క్రొత్తపత్రిక వచ్చిందంటే చాలు! మా ఆవిణ్ణి వంటయింట్లోంచి బయటికి పంపి ఆవిడ పనుల్ని నేను చేయటం




ప్రారంభించేను. అప్పట్నుంచే ఎన్నడూ లేందీ మా ఆవిడ నాపై విసుక్కోవటం ప్రారంభించింది. నాపై భయంతో అపత్రికని తిరగవేస్తుందేకాని అది చదివిన పాపాన పోవటంలేదని నేను గమనిస్తూనే ఉన్నాను. ఆవిడ ధ్యాసంతావంటయింట్లో నేను చేస్తున్న పనులమీదే వుంటుంది. ఆవిడ పత్రిక చదువుతుందా లేదా అని గమనించటానికి నేను అడపా దడపా యివతలికి రావటమూ, ఆ కారణంగా నేను చేస్తున్న పనుల్ని మంటకలపటమూ జరిగింది. ఓ సారి పొయ్యిమీది పాలని గమనించకుండా నేలపాల్జేశాను. మరో సారి కూరను మాడ్చేయటమూ, అన్నం వారుస్తూ నా అరచేతుల్ని బొబ్బలెక్కించుకోవటమూ, జరిగింది. అదే సమయంలో నేనేంచేస్తున్నానా అంటూ నన్నే గమనిస్తూన్న మా ఆవిడ కాస్తా ఆ పత్రికని నేలకి విసిరికొట్టి సుడిగాలిలా వంటయింట్లోకి దూసుకవచ్చి నన్నోదులుపు దులిపి బయటికంపి ఉసూరుమంటూ మళ్ళీ తన పనుల్లో తాను లీనమయ్యేది. ఈ విధంగా మా ఆవిడలో కథాజ్ఞానం కలిగించటానికి గాను నేజేసిన ప్రథమ ప్రయత్నం విఫలమైపోయింది.

యిహ యిది సరియైన పద్ధతి కాదంటూ మరో ప్రయత్నం ప్రారంభించాను. మా ఆవిడకు పనులన్నీ అయిపోయాక గొడ్డులాపడి నిద్రపోటం అలవాటు. ముమ్మందు మా ఆవిడ కదలికకుగాను మా యింటి తలుపులన్నింటినీ మార్చవలసి ఉంటుందని భవిష్యత్తు నన్నను క్షణం హెచ్చరిస్తూనే వుంటుంది. అసలే మాది క్రొత్తయిల్లు. అతి త్వరలో నేవున్న తలుపుల్ని పీకేయించి క్రొత్తవి పెట్టించ

వలసి వస్తుందేమోనని నేను భయపడని క్షణాలు అరుదు యిహ ఆవిణ్ణలా మధ్యాహ్నముపూట నిద్రపోతూ గున్న ఏనుగులా ఎదిగిపోవటాన్ని అరికట్టటానికి నిశ్చయించుకున్నాను. దానికో పథకాన్ని ఆలోచించాను.

మధ్యాహ్నం నిద్రపోకుండా ఉండేట్టు ఆ సమయంలో పత్రికల్ని విధిగా చదివేట్లుగా ఏర్పాటుచేసి ఒకే దెబ్బకి రెండు పిట్టలు! అనుకుంటూ అతి సంబరపడిపోయాను. కాని ఆ మండుటెండలో నేను విశ్రాంతిని కోల్పోయి పిల్లల్ని కనిపెట్టుకుని వుండవలసి వచ్చింది. పెద్దవాడసలే పెంకి వెధవ! రెండోవాడు రౌడీవెధవ! యిద్దర్నీ ఓ పట్టాన బుద్ధిగా వుంచలేకపోయాను. ఆ నా ప్రయత్నంలో వాళ్ళు నాచేత నాలుగు చెరువుల నీళ్లని త్రాగించినంత పని చేసేరు.

మా యింటిని మా అమ్మా నాన్నల అనంతరం మా అన్నదమ్ములు పంచుకోగా నా వాటాకో వరండా, పెద్దగదీ, ఓ చిన్నగదీ, దాన్నానుకొని వుండే వంటగదీ వచ్చాయి. ఆ యిల్లు మా కుటుంబానికి ముక్తసరిగా బాగానే సరిపోతోంది. చిన్న గదిని సామాన్లకి, పెద్ద గదిని డ్రాయింగ్ కం బెడ్‌రూంగా వాడుకుంటున్నాం.

యిప్పుడిక్కడ మళ్ళీ చిక్కొచ్చిపడింది. ఆ పెద్దగది కాస్తా మధ్యాహ్నం వేళ మా పిల్లల అల్లరితోనూ వారిపై నే వేసే కేకలతోనూ మార్మోగిపోతుంది ఆ అలజడిలో మా ఆవిడ పత్రికా పఠనము కుంటుపడుతున్నట్టు తోచింది ఎన్ని యిక్కట్లున్నా పడి, ఎన్ని దుముల్నయినా ఎదుర్కొని మా ఆవిడలో పఠనాశక్తి పెంపొందించి కథారచనాజ్ఞానం కలిగించి కనీసం ఒక్క కథనన్నా ఆవిడచేత వ్రాయించకుండా గుండెల మీద చేతులేసుకు నిద్రపోకూడదని శపథం చేసుకున్నాను కదా మరి?

అందుకోసం మర్నాటి మధ్యాహ్నం పూట మా ఆవిడ పత్రికా పఠనానికి భంగం కలుగకుండా వుంటానికని మా పిల్లల్ని వరండాలోకి చేర్చి పెద్ద గది ముందు తలుపుని బిడాయించి ఓ వాలు కుర్చీలో చెరగిలపడిపోయి ప్లాటుకోసం పాట్లుపడసాగాను.

మిట్టమధ్యాహ్నపు టెండ నిప్పులు చెరుగుతోంది. వేడిగాలులు వీస్తున్నాయి. అరగంటసేపు ఆలోచనల్లో మునిగిపోయి ఓ కథాకల్పనకి నాంది పలికి ప్రక్కకి చూచేసరికి నాకడుపుతరుక్కుపోయింది. చురచుర లాడుతూన్న కటిక నేలపై ఆడుతూ, ఆడుతూనే నిద్రలోకి జారిపోయారు పిల్లలు. మెల్లిగా లేచి ఆ వంక నడిచేను. పెద్దగదిలోనుంచి కాగితాల రెపరెపలు వినిపించేయి. మా ఆవిడ శ్రద్ధగా చదువుకుంటుందంటే చాలునను కుని వరండాలోనే ఓ ప్రక్క నున్న నవారు మంచాన్ని వాల్చి పిల్లల్ని అందు

లోకి చేర్చి మళ్ళీ కుర్చీలో వాలిపోయి ఇందాక మనసులో మెరిసిన కథకి రూప కల్పన చేసుకోసాగాను.

అరగంట గడిచింది. లోపల్నుంచి కాగితాల రెపరెపలు వినిపిస్తూనే వున్నాయి. వరండాలోకి పడమటి ఎండ సోకసాగింది. నిద్రపోతున్న పిల్లల్నిలా ఎండలో వుంచడమెందుకని లేచి ముందుగా చిన్నవాణ్ణందుకుని పెద్ద గది తలుపుని త్రోసాను. ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూసి నీరుగారిపోయాను అందాకా నేనూ పిల్లలూ పడిన శ్రమా, అంతవరకూ నాక్కలిగిన సంతోషమూ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి.

ఎదురుగా మా ఆవిడ ఒంటిమీద కూడా స్పృహలేకుండా గొడ్డులా నిద్ర పోతోంది. ప్రక్కనే పడివున్న పత్రిక లోని పుటలు కాస్తా కిటికీలో నుంచి వస్తూన్న గాలి తెరలకి కదిలి రెపరెప లాడుతున్నాయి. ఉసూరు మంటూ పిల్లల్ని లోనికి చేర్చి కలమూ, కాగితా ల్నందుకున్నాను.

యింటికొచ్చినప్పుడల్లా నన్నూ, నా కథల్నీ మెచ్చుకుంటూ నన్ను ప్రోత్సహిస్తుంటారు నా స్నేహితులు. అదే సమయంలో అక్కడే నిలబడిపోయి వాళ్లముందే నన్నూ, నా కథల్నీ ఖండించివేస్తూంటుంది మా ఆవిడ. అంత మాత్రాన ఆవిడ నా కథల్ని చదువు తుందా అంటే అదీలేదు. అందువల్ల ఆ విమర్శనల్లో అర్థం ఎంతమాత్రమూ వుండదన్న విషయం నా కొక్కడికే తెలుసు. కనీసం నేను రాసిన కథల్నయినా చదివి ఏదన్నా వాగితే బావుండేది కాని అలా అందరిముందూ పట్టుకుని నన్నూ నా కథల్ని గురించి చులకనగా మాట్లాడటం ఈ మధ్య మరీ ఎక్కువయిపోయింది. అయినప్పటికినీ అదంతా నేను స్పోర్టివ్‌గానే తీసుకుంటూ ఉంటాను.

కాని కొన్ని సమయాల్లో మా ఆవిడ మీద నాకు కోపం పీకలదాకా వస్తుంది. మూడ్‌వచ్చి నేనేదో అలా రాసుకోవటానికలా కూచుంటానో లేదో మా ఆవిడకి నే నారోజు చేయవలసిన పనులన్నీ వరసగా అపుడే జ్ఞాపకం వస్తాయి. అప్పుడు నన్ను బజారుకు వెళ్మండంటూ కూచుంటుంది. అప్పటిదాకా కనీసం జ్ఞాపకానిగ్గూడా రాని పనులు కాస్తా ఆవిడ కప్పటికప్పుడు అత్యంతవసరాలయి కూచుంటాయి. పెద్ద గదిలోంచి చిన్న గదిలోకి, చిన్న గదిలోంచి వంటగది లోకి కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ ఆ బజారు పనులగురించి నన్ను పదేపదే హెచ్చరిస్తూ వుంటుంది. దాంతో నాకు చిర్రెత్తుకుపోయి ఆవిడ్ని కేకలేయటమూ నానా రబహ పడటమూ జరుగుతుంది. ఈలోగా మనస్సులోకి వచ్చిన ప్లాట్ కాస్తా మరుగునపడిపోతుంది. ప్రాయాలన్న ఆస్పిరిదే మటుమాయమవుతుంది కేవలం ఆ సమయాల్లో మాత్రమే నేను

మా ఆవిడ్ని మనస్ఫూర్తిగా ద్వేషిస్తూ వుంటాను.

వారం రోజుల తర్వాతనుకుంటాను మా కుటుంబంలో చనువుగా ఉండే ఓ నలుగురు మిత్రుల ముందు నన్ను విమర్శించింది మా ఆవిడ. నే నావిడ్ని పత్రికలు చదివేలా చేస్తున్న ఏ ఒక ప్రయత్నమో ఫలించి ఆ వారం పత్రికలోనే అచ్చయిన వొకదాన్ని చదివేలా చేసింది. ఆ రచనేమీ బాగోలేదనీ, అలాంటి కథని ఎవరయినా వ్రాయొచ్చుననీ, చివరకు తానయినా వ్రాయగలనంటూ కామెంటుచేసి వంటగదిలోకి విసవిస వెళ్ళిపోయింది. ఆవిడయితే వెళ్ళిపోయింది కాని ఆవిడ పలికిన చివరి వాక్యం మాత్రం నాలో పన్నీటిని కురిపించేసింది. నా మిత్రులింకా ఆ పెద్ద గదిలోనే వున్నారనే విషయాన్ని కూడా మరచి ఆవిడ వెనకాలే నేనూ వంటగదిలోకి పరుగుతీసేను

"సరూ! సరూ! ప్లీజ్! నీవు అలాంటిదే ఓ కథ వ్రాస్తావా?" అంటూ మా ఆవిడ పక్కనే పీటేసుక్కూచున్నాను. అప్పుడు మా ఆవిడ అంట్లు తోముతోంది. బయట నా మిత్రులలా కూచుని వుండగా నేను వంటింట్లోకొచ్చి ఆవిడ వెన్ను నానుకుని కూచుని కథ గురించి అడిగేసరికి మా ఆవిడకు చిరాకు పుట్టుకొచ్చింది

"కథాలేదు గితాలేదు! మీర్సలు బయటికి వెళతారా లేదా?" అంటూ గంయ్‌మంది. అలా యింటికప్పు ఎగిరిపోయేలా అరిచేసరికి నా తల తీసినట్లయింది. దిగాలుగా లేచి పెద్ద గదిలోకి అడుగుపెట్టిన నన్ను చూచి నా మిత్రులు గొల్లున నవ్వేరు. దాంతో నేను అధఃపాతాళానికి కృంగిపోయేను.

"ఏవిటోయ్? మీ ఆవిడకూడా కథలు వ్రాస్తుందటోయ్! మాకెప్పుడూ చెప్పలేదేవోయ్?" అంటూ నన్ను ఉడికించేరు వాళ్ళు. దాంతో నాకు మంట పుట్టుకు వచ్చింది

"ఆ! కథా? దాని మొహవా? పత్రిక చదవటం చేతనవదు కాని కథలేం వ్రాస్తుంది?" అంటూ విసుక్కున్నాను.


తర్వాత ఓ పదినిమిషాలకి వాళ్ళు వెళ్ళిపోగానే వంటిల్లెందుకో నిశ్శబ్దంగా వున్నట్లు తోచింది. ఆ నిశ్శబ్దంలో నుంచి వెక్కిళ్ళు వినిపించేయి. గభాలున వంటగదిలోకి దూరేను.

"ఏవిటి సరూ!" అంటూ దగ్గరకు తీసుకోబోయాను

"నా దగ్గరకు రాకండి!" నన్ను దూరంగా త్రోసేసింది.

"అసలు విషయం ఏమిటో నాకు చెప్పందే ఎలా తెలుస్తుంది? ప్లీజ్ చెప్పవూ!" దీనంగా ప్రశ్నించేను.

"తెలీదూ? ఎందుకు తెలుస్తుంది?




నేనే చదువుకున్న దాన్నవుతే తెలిసొచ్చేది."

నేను తెల్లబోయాను. ఆ వెంటే మళ్ళీ నాకు విసుగు పుట్టుకొచ్చింది.

"ఏమిటా డొంకతిరుగుడు వ్యవహారం ? ఎందుకేడుస్తున్నావో చెప్పకుండా ఏవిటీ ఆగడం ?" అన్నాను తీవ్రంగా.

"ఏడుపుకాక నాకు మిగిలిందేవిటి ? అనుక్షణం నన్ను చదువురానిదంటూ నలుగుర్లో అవమానం చేసేబదులు నాకింత విషం పెట్టేయండి ! మీకీ అడ్డు తొలుగుతుంది," అంటూ దిగ్గున లేచి బాత్‌రూంలోకి దూరింది. దాంతో నా ఆగ్రహం చల్లారిపోయింది. జాలిగా ఆవిడ వెళ్ళినవంకే చూస్తూ వుండిపోయాను. తను నలుగుర్లో నన్ను ఎన్ని మాటలన్నా ఫరవాలేదు కాని, ఆ పని నేనెపుడన్నా చేస్తేమాత్రం అది ఈ రకంగా పరిణమిస్తుంది

అలా ఎన్నో సంఘటనలు జరిగాయి. కానీ నా ప్రయత్నాన్ని మాత్రం మానుకోలేదు

ఆ తర్వాత ప్రతి పనికీ, మా ఆవిడ ప్రతి కోరికకీ తను పత్రికలు విరివిగా చదవాలనే కండిషన్ని పెడుతూ వచ్చాను. అప్పటికప్పుడు అలాగే అంటూ వుండేది. కాని ఆ తర్వాత మళ్ళీ షరా మామూలే !

కొన్నాళ్ళకు మరో ఆలోచన వచ్చింది. తానెలాగూ చదవటంలేదు కాబట్టి ఆవిణ్ణి దగ్గరగా కూచోబెట్టుకుని నేనే కథల్ని చదివి వినిపించటం మొదలుపెట్టేను. అలా నేను చదువుతూన్నపుడు ఏ కాసేపో వినటమూ ఆ తర్వాత కూరమాడిపోతూందనో, చిన్న

వాడు దొడ్లోకి వెళ్ళారనో, బట్టలుతుక్కోవాలనో, యిల్లు తుడవాలనో యిలా నానా రకాల వంకలతో లేచి పోయేది. దాంతో నాలోని కోపం వెర్రి తలలు వేసేది. కాని నన్ను నేనే నిగ్రహించుకునేవాణ్ణి.

నాకు సాధారణంగా రాత్రిళ్ళు ఓ పట్టాన నిద్రపట్టి చావదు. ఏవో ఆలోచనలు నా బుర్రని తొలుస్తూ వుంటాయి. నా ఆలోచనలు పలురకాలు. ఓసారి కథకి ప్లాటుకోసం ఆలోచిస్తుంటాను. మరోసారి వ్రాసినవాటి గురించి ఆలోచిస్తాను. లేకపోతే వ్రాస్తూన్నదాన్ని గురించి ఆలోచిస్తాను. అదీగాకపోతే నాకన్నా ఎక్కువగా కీర్తిగడిస్తూన్న సోదర రచయితలపై ఈర్ష్య పడుతుంటాను. లేదా నేను పోటీకి పంపిన రచనలకి బహుమతులొచ్చినట్టూ, సన్మానాలు జరిగినట్టూ కలలు కంటూ వుంటాను. అవేవీ లేనపుడు అర్ధరాత్రి దాకా వ్రాసుకుంటూ వుంటాను.

అలాంటి సమయాల్లో నన్ను విసిగిస్తూంటుంది మా ఆవిడ.

లైటార్పేయండి! కళ్ళు మండిపోతున్నాయం"టుందోసారి. "రోజంతా చాకిరీచేసి చచ్చి చెడి కాస్త పెందరాళే పడుకుందావనే యోగం లేదు." అంటుంది మరోసారి. "ఏం రాతలో నా ప్రాణానికి దాపురించాయి" అంటుందింకోసారి.

యిలాంటి డైలాగులు నాలోని ఓరిమిని నిలువునా పరీక్షిస్తాయి. దాంతో వశం తప్పిన నా ఆగ్రహాన్ని దుపులో పెట్టుకోలేక నిలువెత్తునా లేచి మా ఆవిణ్ణి కేకలేయటమో లేదా కోపాన్ని నిలువునా మ్రింగి కుక్కిన పేనల్లే ముడుచుకుని పడుకోవటమో జరుగుతుంది. నేను చీవాట్లు పెట్టిన రోజున నాకేమో నిద్రముంచుకు వస్తుంది. మా ఆవిడేమో కన్నీళ్ళతో తలగడల్ని తడిపేస్తూ తనని నాబోటి రచయిత కిచ్చి పెళ్ళిచేసినవాళ్ళ పుట్టింటివాళ్ళనీ, నన్ను కన్నందుకు మా యింటివాళ్ళనీ నాకు వినిపించకుండా గొణుక్కుంటూ కడిగేస్తూ తెల్లవారదీస్తుంది. యిహ మర్నాటి ఉదయాన్నే కళ్ళన్నీ వాచిపోయి ఎదురవుతూండే మా ఆవిడ మొహాన్ని నేను చూడలేకపోతూంటాను. ఆ తర్వాత రెండురోజులకుగాని ఆ జడివానా, తుఫానూ తగ్గుముఖం పట్టదు.

హఠాత్తుగా ఓ రోజు ఉదయం మా ఆవిడ నన్నాశ్చర్యపరిచింది.

"అలా బజారు కెళ్ళి లైబ్రరీనుంచి క్రొత్త పత్రికల్ని పట్రండి! చదువుతాను. కాని ఓ షరతు! మీరు సిగరెట్లు మానేయాలి!" అంటూ కూచుంది.

మా ఆవిడ పుస్తకాలు చదువుతాననేసరికి ఎంత సంతోషం కలిగిందో



నేను సిగరెట్లు మానేయాలనేసరికి అంతే విచారం కలిగింది నాకు మా ఆవిడా, పిల్లలూ కలిసి నా శరీరంలోని గుండె కాయలాంటి స్థానాన్నాక్రమిస్తే నేను త్రాగే సిగరెట్టును నేను నా ఊపిరిగా భావిస్తాంటాను ఆ సిగరెట్టలా నాతో అవినాభావ సంబంధాన్ని పెంచుకుని మా ఆవిడతో సమానంగా నా హృదయ పీఠాన్నధిష్ఠించటంతో మా ఆవిడ కది శత్రువుగా పరిణమించింది ఆ సిగరెట్టు నా శ్వాసకోశాలకి హానిని కలిగిస్తుందని ఆవిడ నమ్మకం. నాచేత ఆ సిగరెట్టుని మాన్పించటానికి ఆవిడచేసిన విశ్వప్రయత్నాల్లో ఏదీ ఫలించక చివరికి నా బలహీనతని కనిపెట్టి నాపై ఈ అస్త్రాన్ని ప్రయోగించింది

ఎంతో ఆలోచించి, ఒకటికి రెండు సార్లు నా చర్యని బేరీజు వేసుకుని చివరికి సిగరెట్టుని మానేయటానికే నిశ్చయించుకున్నాను

ఎలాగయితేనేమి, నేను సిగరెట్లు మానేయడం జరిగింది మా ఆవిడ

కోరిన పత్రికనల్లా లైబ్రరీనుంచి తెప్పిస్తూ వచ్చాను. నా ముందుకూడా మా ఆవిడ శ్రద్ధగా చదువుతున్నట్లే కనిపించేది. కాని పత్రికేదన్నా రాగానే పదిహేన్నిమిషాల్లోనే చదివేసానంటూ నాకందించేది. ఆ పత్రికలో వుండేవి రెండో మూడో కథలేగా ? అందుకే త్వరగా చదివేసినట్లుంది. పైగా చదివే వేగం కూడా పెరిగిందనుకుంటూ సంతోషపడసాగాను నేను.

ఓ రోజు నేను ఆఫీసునుంచి వచ్చే సరికి పత్రికని ముందుగా పెట్టుకుని ఏదో వ్రాసుకుంటూన్న మా ఆవిడ కాస్తా, సిగ్గుపడుతూ వ్రాస్తూన్న ఆ కాగితాన్ని తీసి దాచేసుకుంది. ఆ క్షణంలో నాకు కలిగిన సంతోషం అంతా యింతా కాదు. క్రొత్త పత్రిక తిరగవేస్తుండగా ఏదో ప్లాటు మనస్సులో మెరిసి ఆ ఎమోషన్‌లో విషయాన్ని కాగితంపై పెడుతూ రచన కంకురార్పణ చేసిందనుకుంటూ ఎంతో ఆనందపడిపోయాను. నేను అక్కడి నుంచే ఏదన్నా ప్రశ్నిస్తే ఆవిడ మూడ్ చెడిపోతుందని పక్కకి తప్పుకుని బాత్‌రూం వంక అడుగులు వేసేను.

మా ఆవిడ అపుడపుడూ ఏదో వ్రాసుకుంటూ కనిపించేది


ఆ విషయాన్ని నేను గమనిస్తూన్నట్లు తెలీనీకుండా జాగ్రత్తపడుతూనే ఆవిడ వ్రాసేదేంటో తెలుసుకోవాలనే కుతూహలాన్ని పెంచుకుంటూ వచ్చేను. నేను బాహాటంగా తెలుసుకో ప్రయత్నిస్తే మా ఆవిడలోని యిన్షియేటివ్ కాస్తా పోతుందని నా భయం. అందుకని ఆవిడ వ్రాస్తూన్న కాగితాలకోసం చాటుగా యిల్లంతా గాలించేను. కాని ఎక్కడా కనిపించలేదని వాటినంత పకడ్బందీగా ఎక్కడ దాస్తున్నదో నన్నదే నాకంతుపట్టటంలేదు.

అలా కొన్నిరోజులు గడిచేయి. మా ఆవిడ చేస్తున్న ప్రయత్నాలవల్ల ఆమె తప్పక కథ వ్రాయగలదన్న గాఢనమ్మకం నాలో పాదుకుపోతోంది.

ఓ రోజు ఉదయం నే నాఫీసుకు బయలుదేరబోతూండగా పోస్టాఫీసు పాస్ బుక్కుని తెచ్చి నాకందించింది మా ఆవిడ. ఈ మధ్య సేవింగ్‌ఎకవుంటులో నుంచి డబ్బు తీయవలసిన అవసర కార్యం ఏదీ వున్నట్లు నాకు జ్ఞాపకం రావటంలేదు. పుస్తకం అందుకుంటూ ప్రశ్నార్థకంగా మా ఆవిడ వంక చూచేను.

"అందులోని డబ్బుని డిపాజిట్ చేయండి ?" అంది ముసి ముసి నవ్వులొలకబోస్తూ. పుస్తకం మధ్యలో రెండు వందరూపాయల కాగితాలు కన్పించేయి.

"ఎక్కడివివి ?" అదుర్దాగా ప్రశ్నించాను.




"ఎక్కడివవుతే మీకేంటి ? ఆ డబ్బుని అందులో జమ వేయించండంతే!" అంటూ గిర్రున వెనుదిరిగ బోతున్నదాన్నల్లా జబ్బపుచ్చుకుని ఆపాను.

"ఏవిటా తల బిరుసు ? డబ్బెక్కడిదంటే చెప్పవేం ?"

"యింటి ఖర్చుల్లోంచి పొదుపు చేసాను."

"అదెలా ?" ఆశ్చర్యపోతున్నాను నేను.

"మీరు సిగరెట్లు మానేసినప్పటి నుంచీ ఆ డబ్బు గత మూడు మాసాలుగా మిగులుతోంది. అంతేగాక నేను రోజుకోరకం టిఫిన్ చేసి కట్టిస్తూంటే బాగా తినటానికలవాటయి నా ప్రయత్నం లేకుండానే మీరు హోటల్లో చిరుతిళ్ళు మానుకున్నారు. ఆ బాపతు డబ్బుకూడా గత నాలుగు నెలలుగా మిగులుతోంది. ఈ మొత్తమంతా అలా ఆదా చేసాను." అంది హాయిగా నవ్వుతూ.

ఆ క్షణంలో నాకు మా ఆవిడమీద చెప్పలేనంత ప్రేమ పుట్టుకు వచ్చింది. గభాల్న ఆవిణ్ణి కౌగిట్లోకి తీసుకుని ఎముకలు నలిగేలా అదుముకుని ముద్దెట్టుకుని వదిలేను.

ఆ సాయంకాలం నేనింట్లోకి అడుగు పెట్టగానే ఏదో వ్రాసుకుంటూన్న మా ఆవిడ కనిపించింది. ఎన్నాళ్ళుగానో కుతూహలాన్ని అణుచుకుంటూన్న నేనిహ ఆగలేకపోయాను. మెల్లిగా వెళ్ళి ఆవిడ వెనకాలకి చేరాను. నన్ను మా ఆవిడ గమనించలేదు కాని ఆవిడ

వ్రాస్తూన్న విషయాన్ని చూడగానే నాలోని కుతూహలం కాస్తా కుదుళ్ళ నుంచే తొలగిపోయింది.

ఆదివారం పత్రికలో వచ్చిన క్రొత్త వంటకాల్ని వివరంగా ఓ కాగితంపై కాపీ చేసుకుంటోందావిడ. చిరాగ్గా వెళ్ళి కుర్చీలోకి జారిపోయాను. మా ఆవిడ గభాలున నావంక తిరిగి నన్ను చూస్తూనే తాను వ్రాస్తూన్న కాగితాన్ని దాచుకోబోయింది.

అలా దాచుకోబోయే పద్ధతిని చూడగానే నాకెందుకో అనుమానం వేసింది. వెంటనే ఆవిడ యింతకాలమూ వ్రాస్తూ వచ్చిందేదో తెలుసుకోక తప్పదనిపించింది.

"సరూ ! లోగడ నీవు వ్రాసిన కథ లిలా పట్రా !" అన్నాను మెల్లిగా.

"కథ లేవిటి ? నేను వ్రాయట వేమిటి? నా మొహం !" అంటూ లేచిందావిడ.

"సరూ ! ప్లీజ్ పట్రా ! చూస్తాను. తప్పులుంటే దిద్దిపెడతాను" అన్నాను గోముగా.

మా ఆవిడ మౌనం వహించింది. అభిజ్ఞునయిస్తూనే వెళ్ళి చివరకు ఆవిడ ప్రక్కనే వంటగదిలో తిష్ఠ వేసాను. అరగంట సేపు బతిమిలాడిం తర్వాత మా ఆవిడ తెలిపిన నిజాన్ని వినేసరికి నాకు గంగవెర్రులు పుట్టుకొచ్చేయి.

తను అన్నాళ్ళుగా వ్రాస్తున్నదంతా క్రొత్త పత్రికల్లో వెలువడే రకరకాల క్రొత్తరకం వంటకాల గురించట ! తన ఆ వ్రాతలే నాకు రోజుకోరకం టిఫిన్ చేయించి పెట్టగలిగాయట ! అందువల్లనే నేను మా ఆఫీసు బ్రేక్ టైంలో హోటళ్ళకి వెళ్ళడం మానుకున్నానట ! అంతేకాని తాను యింతకాలంగా ఏ ఒక్క కథనీ చదివిన పాపాన పోలేదట ! పత్రికల్ని లైబ్రరీకి తిరిగి యివ్వాల్సి వుంటుంది కాబట్టి వ్రాసుకోవలసి వచ్చిందట !

అన్ని నిజాల్ని ఒక్కసారిగా భరించలేకపోయాను. యిహ ఆ క్షణాన్నే నా శపథాన్ని ఉపసంహరించుకోక తప్పింది కాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ మా ఆవిణ్ణి రచయిత్రిని చేయలేనన్న విషయం విశదమైపోయింది. కనకపు సింహాసనమున... అనే పద్యం వుండనే వుందిగా మరి?...

